www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 21 ఆగస్టు 2024
5
చిత్తూరు

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ నేడు బంద్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరు కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద వారు సమావేశమైయ్యారు. బంద్‌కు సంబంధించి విధివిదానాలను చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్ నిరసన

విజయవంతం చేయాలని నాయకుల పిలుపు

కార్యక్రమానికి మాల, మాదిగ, గిరిజన, వర్గానికి చెందిన దళిత నాయకులు అందరూ పాల్గొనాలని కోరారు. కులవాద మతోన్మాధులకు బుద్ధి చెప్పే విధంగా పోరాటంలో పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు రాజకుమార్, ధనంజయలు, దామోరం, లోకానాధం, ఐశాక్ బాబు, షణ్ముగం, దేవ, పార్ధ సారథి, మురళి, బుల్లెట్ బాబు, రాజబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణానికి రుణ సౌకర్యం

- లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తాం
- కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి

మొక్కను నాటుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కాలనీ దారులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కార్వేటినగరం: పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు రుణ సదుపాయం కల్పించి పేద ఇండ్లను పూర్తి చేయడానికి తోడ్పతామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పద్మ సరస్సు, పచ్చికాపల్లం రోడ్డులోని కాలనీల్లో పెండింగ్‌లో ఇళ్లను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా రూ.50వేల రుణ సౌకర్యం కల్పించి లబ్ధిదారులకు తోడ్పడాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుకను ఇస్తామన్నారు. అనంతరం మండలంలోని ఆర్‌కేవీబీపేట గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. అలాగే సచివాలయ సిబ్బందితో ఆన్లైన్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

వ్యవసాయంలో యాంత్రిక పద్ధతిని అనుసరించాలి

రైతులు వ్యవసాయంలో యాంత్రిక పద్ధతిని అనుసరించాలని, తద్వారా ఖర్చు, కాలం ఆదా అవుతుందని కలెక్టర్ సూచించారు. రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మందులు పిచికారికి డ్రోన్లను వినియోగించుకోవాలన్నారు. ఆ తరువాత జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వర రాజు ఇంటి వద్ద కలెక్టర్ శ్రీగంధం మొక్కను నాటారు. పాడి రైతుల సమస్యలను నాగేశ్వరరాజు వివరించగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మండల పర్యటనకు విచ్చేసిన కలెక్టర్‌ను ఎంఎం విలాసం బిసి కాలనీ వాసులు కలిశారు. తాము నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. వెంటనే గ్రామస్తుల విన్నపానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి తనకు నివేదికలు పంపాలని తహశీల్దార్ భగవతిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎపిఎంఐటి పీడీ బాలసుబ్రమణ్యం, శాస్త్రవేత్త రాం కుమార్, సర్పంచ్ ధనంజయవర్మ, టిడిపి నాయకులు చంద్రమౌళి రెడ్డి, రాము, రవిరాజు, భద్రరాజు, దేవా, పురుషోత్తం రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీపతి, ఎంఈవోలు విజయకుమార్ పలువురు పాల్గొన్నారు.

27న కాణిపాక బ్రహ్మోత్సవాలపై సమీక్ష

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కాణిపాక వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో వాణి తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈ నెల 27న సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి సమీక్ష సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు కలెక్టర్‌కు వేద ఆశీర్వచనాలు పలికారు.

కలెక్టర్‌కి ఆహ్వానం పలుకుతున్న ఈవో, అర్చకులు

నష్ట పరిహారం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: ఏనుగుల దాడుల్లో నష్టపోయిన పంటలకు, వ్యవసాయ పరికరాలకు ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారాన్ని రైతులకు అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు అందించారు. మంగళవారం మండల కార్యాలయం వద్ద రైతులకు చెక్కుల ద్వారా పరిహారం మొత్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నారాయణపురం తాండా, కుదవగడ్డ, ననియాల, 89పెద్దూరు తదితర గ్రామాల్లో రైతులు పండిస్తున్న పంటలకు ఇటీవల ఏనుగుల దాడుల్లో అపారమైన నష్టం కలిగించిందని వారు పేర్కొన్నారు. అటవీ శాఖ ద్వారా అటవీ సరిహద్దు ప్రాంతాల్లో కందకాలు, సోలార్ కంచె ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గత టిడిపి పాలనలో ఏనుగు దాడుల నివారణకు పూర్తి చర్యలు తీసుకున్న.. వైసీపీ పాలనలో నామమాత్రపు చర్యలు కూడా చేపట్టలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, కుప్పం రేంజర్ జయశంకర్, డిఆర్ఓ ధనుంజయుడు, తహసిల్దార్ బాబు, నేతలు మునస్వామి, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, నాగభూషణం, గంట్లప్ప గౌడు, మనోహర్, విజయ్ రెడ్డి, సుబ్రి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

- ఎమ్మెల్యేకు ఏపీటీఎఫ్ వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను జీవో 117ను రద్దు చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు. మంగళవారం బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య వ్యవస్థను భ్రష్టుపట్టించిన జీవో 117ను రద్దు చేసి తాత్కాలిక సర్దుబాటు చేయాలని, తల్లికి వందనం కార్యక్రమంను ప్రభుత్వబడుల్లో చదివే విద్యార్థులకే ఇవ్వాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అన్నీ విషయాలను విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి నివేదిస్తానని, శాసనసభలో ప్రస్తావిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్, నాయకులు జగదీష్, వేణు అఫ్జల్, లక్షిపతి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేసుకోవాలి

- పశువర్ధక శాఖ జెడి డాక్టర్ ప్రభాకర్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేసుకోవాలని పశువర్ధక శాఖ జెడి డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం బంగారుపాళ్యం మండలం సంక్రాంతి పల్లి పంచాయతీలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ గాలికుంటు నివారణ కోసం ప్రతి ఆరు నెలలకు టీకాలు మంజూరు చేస్తున్నామని, ఈ దఫా 33వ సారి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా నాలుగు నుండి 8నెలల పేయదూడలకు బ్రూసెలోసిస్ వ్యాధి రాకుండా ముందస్తు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, చిత్తూర్ డివిజన్ ఉప సంచాలకులు ఆరిఫ్ వెటర్నరీ పాలె క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బమ్మ, డాక్టర్ ఝాన్సీ, సంక్రాంతి పల్లి జేవివో నాగేంద్ర నాయక్ పలువురు పాల్గొన్నారు.

'పల్స్ సర్వేను పూర్తి చేయండి'

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పల్స్ సర్వేను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన హాజరైయ్యారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రవికిరణ్, ఎంపిడిఒ రాజేంద్ర బాలాజీ, ఏఈ లోకనాథం, శిక్షణా తరగతుల రిసోర్స్ పర్సన్లు సర్గుణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కోరిన వారందరికీ ఉపాధి పనులు

- డ్వామా పీడీ రాజశేఖర్

సోమల సమీపంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

ప్రజాశక్తి-సోమల: కోరిన ప్రతి కూలీకి ఉపాధి హామీ పనులకు కల్పించాలని చిత్తూరు డ్వామా పీడీ రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. కూలీల సంఖ్య పెంచేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. మండలంలోని కందూరు, సోమల పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలను నేరుగా కూలీలను అడిగి తెలుసుకున్నారు. గొల్లపల్లి వద్ద చేపడుతున్న ఫారం పాండు పనులు, కందూరు వద్ద మిని అమృత సరోవర్ పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్లాంటేషన్ పనులకు అధిక ప్రాధానత్య ఇవ్వాలని, కూలీలకు అధికంగా పనిదినాలు కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దినకర్ బాబు, ఉపాధి జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎఫ్‌పిఓ బలోపేతానికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో రైతు ఉత్పత్తి దారుల సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైతు ఉత్పత్తి దారుల సంస్థలకు సంబంధించిన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ చైర్మన్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన, నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేయడానికి వారిని ప్రోత్సహించడానికి సాంకేతికత, క్రెడిట్, మార్కెటింగ్ తదితర సౌకర్యాలను పరిశీలించాలన్నారు. సన్న, చిన్న కారు రైతులు ఎఫ్‌పిఓలలో భాగస్వామ్యం కావడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చునన్నారు. ఆర్థిక బలాన్ని, మార్కెట్ అనుసంధానాన్ని పెంపొందించుకోవడానికి ఎఫ్‌పిఓలు దోహదపడతాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (నాబార్డ్), వివిధ సంస్థల ఆధ్వర్యంలో 17ఎఫ్‌పిఓలు పనిచేయడంలో భాగంగా కేవలం ఎరువుల పంపిణీనే కాకుండా రైతులు పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే అంశంపై త్వరలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలకు సంబంధించిన ఎఫ్‌పిఓలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించేందుకు అవసరమైన బ్యాంకు సాయం నిమిత్తం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో పాలు, కూరగాయలు, మామిడితో పాటు ఉద్యానవన పంటల సాగు వాటికి మార్కెటింగ్ సౌకర్యంపై ఎఫ్‌పిఓలు దృష్టి సారించడం ద్వారా రైతులకు మరింత లాభం చేకూరుతుందని, జిల్లాలో ప్రస్తుతం ఉన్న కోల్డ్ స్టోరేజీలలో పండించిన పంట ఉత్పత్తులను స్టోర్ చేసేందుకు వినియోగించుకోవాలని తెలిపారు. ఎఫ్‌పిఓల పరిధిలో లైసెన్సులు మంజూరుకు సంబంధించి పెండింగ్ ఉంచరాదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, నాబార్డ్ ఏజిఎం సునీల్ కుమార్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీ కృష్ణ, డాక్టర్ ప్రభాకర్, ఎఫ్‌పిఓలు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

డిఎస్‌పి వేంకటాద్రికి సత్కారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రేణిగుంట డీఎస్పీగా కొత్తగా నియమితులైన వెంకటాద్రిని పలువురు ఘనంగా సత్కరించారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న ఆయన్ని కడప జిల్లాకు చెందిన కె రాజరత్నం ఐజగ్, అనంతపూర్ జిల్లాకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కే .శంకరయ్య, బెంగళూరులోని ప్రముఖ బిల్డర్ ఎస్ రవీంద్రారెడ్డి, తిరుపతి జిల్లా నర్సింగ్ కాలేజీల అధ్యక్షులు వై ప్రవీణ్ తదితరులు కలిసి డిఎస్పిని దుశాలవతో సత్కరించారు. ఆయన గతంలో పని చేసిన ప్రదేశాలలో చేసిన సేవలను కొనియాడారు. డిఎస్పి వెంకటాద్రి స్పందిస్తూ నిజంగా గతంలో పనిచేసిన ప్రదేశాలలోని ప్రముఖులు గుర్తుపెట్టుకుని, తిరిగి ఇక్కడికి వచ్చి అభినందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం నియమించిన ప్రదేశంలో శాంతి భద్రతలు కాపాడుతానని మరింత, బాధ్యతతో పని చేస్తానని అన్నారు. అనంతరం పలువురు ఆయనని అభినందించారు.

చేపల మార్కెట్‌ను మార్చండి..

కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: లీలామహల్ రోడ్డులోని ఏర్పాటుచేసిన తాత్కలిక చేపల మార్కెట్ కారణంగా దుర్వాసన వస్తోందని వెంటనే మార్చాలని కోరుతూ స్థానికులు శంకర్ కాలనీ, స్కావెంజర్ కాలనీ, యానాది కాలనీ, మధురానగర్ నివాసులు కమిషనర్ ఎన్ మౌర్యకు మంగళవారం వినతిపత్రం అందించారు.

మాలతీ చందూర్ రచనలతో సమాజంలో మార్పు

సదస్సులో పలువురి వక్తల ఉద్ఘాటన

సదస్సులో పాల్గొన్న తెలుగు సాహితీ వేత్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ : మాలతీ చందూర్ రచనలు సమాజంలో మార్పులు తీసుకొ చ్చా యని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యా లయం తెలుగు అధ్యయ న శాఖలో డాక్టరు మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు సావేరి సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు తెలుగు శాఖాధ్యక్షులు, పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ 1960-80 ల మధ్య స్త్రీల రచనలు ఎక్కువగా వచ్చాయి. ఆ కాలంలోనే మాలతీ చందూర్ స్త్రీలను, సమాజాన్ని, చైతన్యవంతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారన్నారు. స్త్రీ ఎంత ఉన్నతంగా ఉంటుందో ఉండాలో చెబుతూనే కొన్ని పరాజితమైన స్త్రీ పాత్రలను కూడా మాలతీ చందూర్ చిత్రించారన్నారు. 2017 లో ప్రారంభమైన ఈ సదస్సు నిర్విరామంగా జరుగుతూ ఉందని, మాలతీ చందూర్ ట్రస్ట్ 8 లక్షల రూపాయలు ధర్మనిధిని తెలుగుశాఖకు అందించారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి, మహిళా విశ్వ విద్యాలయం ఎస్ఎస్ఎస్‌హెచ్, ఎమ్ డీన్ ఆచార్య సి వాణి, మిసిని మాసపత్రిక సంపాదకులు అశ్వినీకుమార్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అతిథులను, ఉపన్యాసకు లను సత్కరించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో "మాలతీ చందూర్ నవలలు -మహిళా చైతన్యం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన పరిశోధక విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు బి.లక్ష్మీప్రియ, డి యువశ్రీ, ఆచార్యులు, సాహితీ ప్రియులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో వినూత్న 'స్కోర్' పోర్టల్ ప్రారంభం

ప్రజాశక్తి -సత్యవేడు: సుస్థిర అభివృద్ధి చర్యల్లో భాగంగా శ్రీసిటీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ స్కోర్-శ్రీసిటీ ఆన్‌లైన్ రిసోర్స్ ఎక్స్ఛేంజ్) వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం నిర్వహించిన వర్చువల్ లాంచ్ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన సస్టైనబిలిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్ జి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, శ్రీసిటీ ప్రసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ (పర్యావరణం) డా. పి.వెంకటేశ్వరన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'స్కోర్' అనేది వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుందని, సమాచార మార్పిడికి, పర్యావరణం, ఆర్థిక ప్రభావిత విషయ విశ్లేషణకు సహకారం అందిస్తుందని వివరించారు. మిచిగాన్ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ వ్యర్థాలను తగ్గించడం, ఇతర అక్కడ అమలు చేస్తున్న సుస్థిర కార్యక్రమాలు, కార్యాచరణ పథకాలపై డాక్టర్ సుధాకర్ రెడ్డి క్లుప్తంగా ప్రసంగించారు. అత్యంత ఉపయోగకరమైన పోర్టల్‌ను ప్రారంభించ డంలో శ్రీసిటీ చొరవను ఆయన అభినందించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పోర్టల్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. స్కోర్ పోర్టల్ ద్వారా ఉదహరించిన శ్రీసిటీ జీరో-వేస్ట్ కార్యక్రమాలు, సుస్థిర చర్యల పట్ల తమ నిబద్ధతను తెలపడంతో పాటు ఇతర పారిశ్రామిక వాడలకు ఒక మోడల్ గా నిలుస్తాయన్నారు. శ్రీసిటీ జీరో-వేస్ట్ ప్రణాళికలో కీలకమైన వ్యర్థాలు, ఉపయోగించని అదనపు పదార్థాల జాబితా తయారీ, మార్పిడికి సమాచార నెట్‌వర్క్‌గా స్కోర్ పోర్టల్ పనిచేస్తుందన్నారు. దీని ద్వారా అనేక కంపెనీలు ఎదుర్కొంటున్న మిగులు పదార్థాల సేకరణ సవాలును పరిష్కరించడంతో పాటు, పరిశ్రమల్లో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్‌ను సులభతరం చేస్తుందన్నారు.

దోమలపై సమరం సాగిద్దాం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా చిత్తూరు నగరంలోని సంజయ్ గాంధీ నగర్ కాలనీలో డిఎంహెచ్‌వో ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ (బాలికలు) వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డిఎంహెచ్‌వో మాట్లాడుతూ మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని సర్ రోనాల్డ్ రాస్ 1897సంవత్సరం ఆగస్టు 20న కనుగొన్నారని ఆయన కృషి ఫలితంగా మలేరియా వ్యాధిని నిర్మూలించేందుకు అవకాశం కలిగిందన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్, డిస్టిక్ న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ (లెప్రసీ) పిహెచ్‌సి వైద్యాధికారిని, కళాశాల ప్రిన్సిపల్ పాల్గొని ప్రసంగించారు.

విజయపురం: దోమలపై సమరాన్ని కొనసాగిద్దామని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. మండలంలోని మంగళవారం విజయపురం ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన ర్యాలీ చేపట్టారు. పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలని సూచించారు. వ్యక్తిగత రక్షణగా దోమతెరలు వాడాలని తెలిపారు.

బైరెడ్డిపల్లి: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలోని తీర్థం ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. దోమ కాటు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

చిత్తూరులో

సోమలలో

వెదురుకుప్పం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో పచ్చికాపల్లం కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ దోమ కాటు వల్ల వచ్చే వ్యాదులను, నివారణకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ గిరి, ఎస్ఆర్ పురం డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డాక్టర్ గౌరీ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో దోమ కాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు.

ఎస్ఆర్ పురంలో

సదుం: "ప్రపంచ దోమల దినోత్సవం" సందర్భంగా మంగళవారం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీషా ఆధ్వర్యంలో సదుం ఎంపిపి పాఠశాల ఆవరణలో, ఆరోగ్య విస్తరణ అధికారి ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పాలమంద జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలు హెల్త్ సూపర్ వైజర్ నీలకంఠ, జానకి, శిఖామని, హెల్త్ ఆఫీసర్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత

సోమల: మండలంలోని సోమల, కందూరు ఆరోగ్య శాఖ వైద్య సిబ్బంది దోమల నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్లు బాలాజీ, విజయలక్ష్మి, పుంగనూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి గంగయ్య, పాఠశాల హెచ్‌ఎం హరి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను ఉరితీయాలి

పుంగనూరులో

ప్రజాశక్తి-పుంగనూరు: కలకత్తాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను వెంటనే ఉరితీయాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ పి.మానస, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడిసిన్ ఉన్నత విద్యనభ్యసిస్తున్న వైద్యురాలిపై అరాచకానికి పాల్పడ్డ మానవ మృగాన్ని ఉరితీయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకి మహిళలపై కామాంధుల అరాచకాలు పెరిగిపోతున్నాయని 78 సంవత్సరాలు ఈ స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దిశా, నిర్భయ, ఫోక్సో ఇలా ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ ఎటువంటి రక్షణ లేదని చట్టాలన్నీ డబ్బున్న వారి చేతుల్లో చుట్టాలుగా మారుతున్నాయన్నారు. తల్లి జన్మనిస్తే.. డాక్టర్లు పున:ర్జన్మనిస్తున్నారని అటువంటి డాక్టర్స్‌పై లైంగిక వేధింపులు జరపడం చాలా బాధాకరమన్నారు. హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పున:రావృతం కాకుండా చూడవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. అలాగే వైద్య విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మోహన్, నాయకులు ఆసిఫ్ అలీ, సుమంత్, మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వికోట: కలకత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచారంపై వీకోటలో విద్యాసంస్థలు, పార్టీలకు అతీతంగా వివిధ రాజకీయ పక్షాల నేతలు, మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. మంగళవారం రాత్రి జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో వీకోటలోని వైద్యులు, వివిధ పార్టీ నాయకులు, మహిళలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి బయలుదేరి ర్యాలీ లాన్ బజార్ మీదగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రాగ దివ్యజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ రఘుపతి, విద్యానికేతన్ విద్యాసంస్థలు అధినేత డాక్టర్ దామోదర్ రెడ్డి, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధి గణపతి, విసికె పార్టీ అధ్యక్షులు వినోద్, బీఎస్పీ నాయకులు శ్రీనివాసులు, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వికోటలో

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మతులు పరిశీలించారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ళ పొదలను పారిశుద్ధ్య కార్మికుల చేత తొలగించారు. అనంతరం శ్మశాన వాటికలోని సమస్యలను పరిశీలిస్తూ, మంచినీటి సరఫరా చర్యలను పర్యవేక్షించారు.

సన్మానం

ప్రజాశక్తి-విజయపురం: మండలం ఇన్‌ఛార్జ్ ఈవోఆర్‌డి సురేంద్ర కుమార్‌కి గ్రీన్ అంబాసిడర్‌లు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈవోఆర్‌డిగా ఆయన ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించిన సందర్భంగా మండల కార్యాలయంలో దుశ్శాలువలతో సత్కరించారు.

'స్వచ్ఛ కుప్పం'కు సహకరించండి

- కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: స్వచ్ఛ కుప్పంకు పుర ప్రజలు సహకరించాలని కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. పట్టణ పరిసరాల పరిశుభ్రతకు స్థానిక ప్రజలు పురపాలక సంఘం సిబ్బందికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా పట్టణ పరిధిలో ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాలను వాటి యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో, ముళ్ళ పదాలతో విష జంతువులకు ఆవాసంగా మారిందన్నారు. వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రైవేట్ స్థలాలను వాటి యజమానులే శుభ్రపరచాలని, ప్రహరీ గోడ సైతం నిర్మించుకోవాలని పేర్కొన్నారు. అలా కాని పక్షంలో పురపాలక సంఘం పారిశుద్ధ్య సిబ్బందిచే ప్రైవేటు స్థలాలను శుభ్రపరిచి, వాటి ఖర్చులను ఆయా స్థలాల యజమానుల నుంచి వసూలు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా శుభ్రంగా లేని ప్రైవేట్ స్థలాల వీధులలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన అందుకు ఆయా స్థల యజమానులే కారణమవుతారని తెలిపారు.

'ఎస్ఐ జయప్ప సేవలు ఆదర్శనీయం'

ప్రజాశక్తి-విజయపురం: ఎస్ఐ జయప్ప సేవలు తోటి సిబ్బందికి ఆదర్శనీయం అని డిఎస్‌పి కేఎన్ మూర్తి అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్ఐకు వీడ్కోలు సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన డిఎస్‌పి కేఎన్ మూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎస్ఐ జయప్ప విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించారని, శాంతిభద్రతల విషయంగా అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. అనతి కాలంలో ఎస్ఐ అందించిన సేవలను కొనియాడారు. దుశ్శాలువలు, పూలమాలతో పోలీసులు ఎస్ఐని ఘనంగా సన్మానించి ఘన వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్బరామిరెడ్డి, అర్బన్ సీఐ మహేష్, హెడ్ కానిస్టేబుల్స్ చెంగయ్య, జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన వీసీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ మంగళవారం టీటీడీ ఈఓ శ్యామల రావును మర్యాదపూర్వకంగా కలిసినట్లు విశ్వ విద్యాలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం టిటిడి విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధుల గురించి చర్చించారన్నారు. ఏటా అందించే నిధులను ప్రస్తుత సంవత్సరానికి త్వరగా విడుదల అయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం సమర్పించినట్టు చెప్పారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన టిటిడి ఈఓ వీలైన త్వరగా నిధులు విడుదల అయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోండి: రవికుమార్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: తనపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కొళత్తూరు సర్పంచ్ ఎం రవికుమార్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిరాధార కథనం ప్రచురించిన ఓ వార్తను సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల్లో తనపై దుష్ప్రచారం చేస్తూ మానసిక మనోవేదనకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

భూ సమస్యపై విచారణ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టరేట్‌లో ఇచ్చిన భూ ఫిర్యాదుపై మంగళవారం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ విచారణ చేపట్టారు. మండలంలోని బేరిపల్లికి చెందిన జయవేల్ నాటార్ ఇచ్చిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్జీదారునితో ముఖాముఖి మాట్లాడారు. ఆ భూ సమస్య ఇప్పటికే కోర్టు పరిధిలో ఉన్నట్లు గుర్తించి కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఆయన వెంట సర్వేయర్ లావణ్య, విఆర్ఓ హేమచంద్ర ఉన్నారు.



ఇక్కడ వంతెనుండాలే..!

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండలం మాధవ నగర్ సమీపంలో గల వంతెనను పిచ్చి మొక్కలు కప్పేయడంతో వంతెన కనబడకుండా వాహనదారులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి గుండా బెంగళూరు, కుప్పం, మదనపల్లి, చెన్నై, తిరుపతి వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఉంది. పిచ్చి మొక్కల మధ్యలో కనబడకుండా పోవడం, వంతెన వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన వద్ద శుభ్రం చేయించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతి నెల జీతాలు అందిస్తాం: ఈఓఆర్‌డి

ప్రజాశక్తి-విజయపురం: గ్రీన్ అంబాసిడర్‌లకు ప్రతి నెల సక్రమంగా జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు రావలసిన జీతాలను వెంటనే అందించాలని వర్కర్లు కోరారు. జీతాలు సకాలంలో అందక తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంగా ఈఓఆర్‌డి మాట్లాడుతూ ఇకపై సకాలంలో వేతనాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య పనుల్లో లోపాలు లేకుండా చూడాలని ఆయన సూచించారు.

'చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలి'

ప్రజాశక్తి-గుడిపల్లి: చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో తాజ్ మస్రూర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడు రోజుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా రెండవ రోజు పంచాయతీల్లో ద్రవ వ్యర్థాల నిర్వహణ విధానాన్ని సోడిగానిపల్లి ఎస్‌డబ్ల్యూ పీసీ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి చెత్త నిర్వహణ విధానాన్ని వివరించారు. కుప్పం ఈఓపిఆర్‌డి విజయదత్, కార్యదర్శి నరసింహులు అవగాహన కల్పించారు. ఈఓపి ఆర్‌డి శివశంకర్, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణా ఆపండి'

ప్రజాశక్తి-పలమనేరు: మండలంలోని నాగమంగళం వద్దనున్న కౌండిన్య నది సమీపంలో వక్ఫ్ బోర్డు స్థలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సయ్యద్ రసూల్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలించేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా వక్ఫ్ బోర్డు స్థలాలను కాపాడడంతో పాటు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు.

రాయితీపై విత్తనాలు, ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సచివాలయంలో రైతులకు మంగళవారం సర్పంచ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్న విత్తనాలతో పాటు యూరియా అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పకుండా పంట సాగు చేయాలని, అలాగే పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెరికల్చర్ అధికారి నరేష్, వెల్ఫేర్ అధికారి నజీర్ భాష, వెటర్నరీ అసిస్టెంట్ రెడ్డి కుమార్, మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు నాగేశ్వరరావు, వెంకటరమణ, నాదముని, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-విజయపురం(నగరి): మండలంలోని గుండ్రాజు కుప్పం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం దాతలు విద్యా సామగ్రిని అందించారు. దాత ప్రతాప్ తన సొంత నిధులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లు పంపిణీ చేశారు. దాతను ఉపాధ్యాయులు శివకుమార్, కృష్ణయ్య, వెంకటేశులు, శశిధర్‌లు అభినందించారు. కార్యక్రమంలో నటరాజన్, బొబ్బిలి రాజ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

'డిజిటలైజేషన్‌కు సహకరించాలి'

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సింగిల్ విండోల డిజిటలైజేషన్‌కు రైతులు తోడ్పడాలని డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మహేష్, సీఈవో విజయ్ కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం వారు తన కార్యాలయంలో మాట్లాడుతూ అక్టోబర్ 2 తేదీ లోపు భూమి పాసుబుక్, ఆధార్ కార్డ్, మొబైల్ నెంబర్, రేషన్ కార్డుల జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సింగిల్ విండో కార్యాలయంలో అందించి నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రామ సభలకు ఏర్పాట్లు చేయండి: ఎంపీడీవో

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని అన్ని పంచాయతీలలో ఈనెల 23వ తేదీ గ్రామ సభలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గ్రామ సభలపై పంచాయతీ కార్యదర్శిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ కింద జరగవలసిన పనులపై ప్రజల అభిప్రాయాలు తీసుకొని తీర్మానం చేయాలని సూచించారు.

తాగునీటికి రాజకీయ గ్రహణం..!

ప్రజాశక్తి - ఓజిలి: తాగునీటికి రాజకీయ గ్రహణం పట్టింది. రాజకీయ పార్టీల విభేదాల కారణంగా గత 20 రోజులుగా తాగునీరు లేక పజలు అష్ట కష్టాలు పడుతున్నారు. ఈ సంఘటన ఏ అటవీ ప్రాంతమో లేక మారుమూల గ్రామంలో కాదు.. మండల కేంద్రంలో దుస్థితి నెలకొంది. తాగునీటి సమస్యపై అధికారులను కూడా లెక్కచేయకుండా పైప్ లైన్ మరమ్మతులు నిర్వహించారు. దీంతో అధికార , ప్రతిపక్ష పార్టీలు విమర్శలకు దిగి వారి బల ప్రదర్శనలతో తాగు నీరు అందించకపోవడంతో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. మండల కేంద్రంలోని గ్రామ వీధులకు మంచినీరు అందించే పైప్ లైన్ మరమ్మతులకు గురైంది. పైపులను మరమ్మతులు నిర్వహించి యథాస్థానంలో ఏర్పాటు చేయకుండా ఆర్అండ్‌బి రహదారికి ఆనుకొని నూతన పైప్ లైన్ ఏర్పాటు చేయడంలో వివాదానికి దారి తీసింది. పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి యథా స్థానంలో ఏర్పాటు చేయాలని అధికార పార్టీ నాయకులు పట్టు పట్టగా యథా స్థానంలో కొనసాగించడం సాధ్యం కాదని మొండికేయడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. తాగునీటి కోసం ప్రజలు చేతి బోర్ల వద్దకు బారులు తీరాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. గత 20 రోజులుగా తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంతో విసుగు చెందిన మహిళలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకొని ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఓట్ల కోసం వచ్చిన ప్పుడు 'అమ్మలారా.. అక్క లారా.. అని ఓట్లు దండుకుంటారు.. కానీ మా సమస్య తీర్చరా?' అంటూ మండి పడ్డారు. దీనిపై ఎంపీడీవో వి రజనీకాంత్ స్పందించి రెండు రోజుల్లో తాగునీటి పైపులైను మరమ్మతులు నిర్వహించి తాగు నీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళ లు ఆందోళన విరమించారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం కోసం పోరాడాలి: జెవివి

ప్రజాశక్తి- రేణిగుంట: మూఢనమ్మకాల నిరోధక చట్టం కోసం పోరాడాలి జెవివి నాయకులు పేర్కొన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రేణిగుంట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో శాస్త్రీయ పద్ధతులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెవివి మండల కార్యదర్శి కుప్పస్వామి మాట్లాడుతూ ప్రముఖ మానవతావాది, మూఢనమ్మకాల నిర్మూలన కోసం సామాన్యులను చైతన్య పరిచిన, అంధ విశ్వాసాలపై పోరాడిన డాక్టర్ నరేంద్ర దభోల్కర్ 2013, ఆగస్టు 20వ తేదీ మతోన్మాదుల చేతిలో హత్యకు గురయ్యారని, ఆ మహనీయుడి ఆశయానికి అణుగుణంగా సైంటిఫిక్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఓ వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలు మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ భావనలు పెరిగి ప్రజాస్వామ్యం, లౌకికతత్వం దాడికి గురవుతున్నాయని ఈ నేపథ్యంలో సమాజం నుండి మూఢ నమ్మకాలను దూరం చేసి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ప్రతి పౌరుడు నినదించాల్సిన అవసరం వుందన్నారు. సైన్స్ ఉద్యమ ఆందోళనల ఫలితంగా కర్ణాటక, మహారాష్ట్ర లాంటి కొన్ని రాష్ట్రాలలో మూఢ నమ్మకాల నిరోధక చట్టం అమలులో వుందన్నారు. మన రాష్ట్రంలో మూఢనమ్మకాలు చాలా పెద్ద ఎత్తున వ్యాపిస్తున్నాయని, ప్రజా, సైన్స్ సంఘాలు, అభ్యుదయ సంఘాలు కలిసి మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ , తిరుపతి అధ్యక్షుడు నడ్డి నారాయణ , నెల్లూరు ముని లక్ష్మి ప్రిన్సిపాల్ హరిబాబు, ఉపాధ్యాయుడు బాలాజీ ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఫొటోగ్రఫీ ముగింపు వేడుకల్లో ఎస్‌పి

ఎస్‌పి చేతుల మీదుగా సత్కారం, జ్ఞాపికలు అందుకున్న ఫొటో గ్రాఫర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో శాంతి భద్రతలను కాపాడడానికి ఫ్రెండ్లీ పోలీసింగ్ పద్ధతులను అనుసరిస్తున్నామని తిరుపతి జిల్లా ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఫొటో ప్రదర్శనను తిలకించి మాట్లాడారు. జర్నలిస్టుల పాత్ర సమాజంలో ఎంతో కీలకమని, ఫొటోగ్రఫీ వృత్తి నైపుణ్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఒత్తిడితో కూడుకున్న విధి అయినా ఎక్కడా అలసట లేకుండా తమ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తూ బాహ్య ప్రపంచానికి సంఘటన భావాలను ఫొటోలు ద్వారా అందిస్తున్నారని ఫొటోగ్రాఫర్ల శ్రమను కొని యాడారు. అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు వృత్తిపరంగా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఫొటో జర్నలిస్టులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళహస్తి గిరిబాబు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కె రాధాకృష్ణ, కార్యదర్శి రామాపురం లావణ్య కుమార్, కోశాధికారి శివయ్య, ఎలక్ట్రానిక్ మీడియా మాజీ జిల్లా అధ్యక్షుడు ఆర్ మురళీకృష్ణ, ఫొటో జర్నలిస్టులు సిహెచ్ కేవీ.పూర్ణచంద్ర కుమార్, గోపాలకృష్ణ, భాస్కర్, ప్రసాద్, మోహన్ కృష్ణ, శ్రీనివాస్ ప్రసాద్, రాధాకృష్ణ, పీటర్ పాల్గొన్నారు.

దాతలకు గదుల కేటాయింపు రద్దు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం టిటిడిలోని వివిధ ట్రస్టులకు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కేటాయించే గదులను టిటిడి రద్దు చేసింది. అక్టోబరు 4న ధ్వజారోహణం, అక్టోబర్ 12న చక్రస్నానం జరిగే రోజుల్లో మినహా మిగతా రోజులలో దాతలను దర్శనానికి అనుమతిస్తారు. దాతలు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రతి బుధవారం నిర్వహించే 'విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో తిరుపతి పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలు పరిష్కారించుకోవాలని తిరుపతి పట్టణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వాసుదేవరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 21న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కింది కార్యాలయంలో వినియోగదారుల నుండి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. సబ్ డివిజన్ – 1 కార్యాలయం, టీటీడీ ఏడి బిల్డింగ్, కెటీ రోడ్డు, బాలాజీ కాలనీ, తిరుపతి నార్త్, తిరుపతి వెస్ట్, రాజీవ్ నగర్ సెక్షన్‌లలో స్వీకరిస్తామన్నారు. సబ్ డివిజన్ – 2 కార్యాలయం, శ్రీనివాసం, తిరుపతి ఈస్ట్, కొర్లగుంట, దామినేడు, మాధవ నగర్, మంగళం రూరల్ ప్రాంతాల్లో స్వీకరిస్తామని తెలిపారు. సబ్ డివిజన్ – 3 టౌన్ డివిజన్ కార్యాలయం, తిరుచానూరు, తిరుపతి సౌత్, అవిలాల, ఆపరేషన్ సెక్షన్ కార్యాలయాల్లో వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టండి : ఏఎస్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : బాల్య వివాహాలను తల్లిదండ్రులు అరికట్టాలని ఏఎస్ఐ గిరిజ పేర్కొన్నారు. స్థానిక పద్మావతి మహిళా యూనివర్సిటీలో తల్లి దండ్రులు, విద్యార్థులతో నిర్వహించిన కౌన్సెలింగ్ లో ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలను బాగా చదివించి వారిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన తరువాతనే ఆడపిల్లలకు వివాహం జరిపించాలని అలా కాకుండా బాల్యవివాహాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఎలా మెలుగుతున్నారు సెల్ ఫోన్లలో ఏమేమి వెబ్ సైట్లు చూస్తున్నారో పరిశీలించాలన్నారు. ప్రతి రోజు పిల్లలతో కొంత సమయం గడపాలన్నారు. చాలాచోట్ల ఆడపిల్లలను బెదిరించి వారిని లైంగికంగా వేధిస్తున్నారని అలాంటి వారిని గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లల తల్లిదండ్రులు ఆ జాగ్రత్త వహించాలని ఆ పిల్లలను ఎక్కడ కానీ పనులలో పెట్టకూడదన్నారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పది మందికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పది మందికి కోర్టు జరిమానా విధించినట్లు చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. సోమవారం నగరంలోని పలు చోట్ల మద్యం తాగి వాహనం నడుపుతున్న 10మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆ మేరకు మంగళవారం వారిని కోర్టులో హాజరుపరచగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి వారికి ఒకొక్కరికి రూ.పది వేల చొప్పున రూ.లక్ష జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గ్యాస్ లీకేజీ.. ఇల్లు దగ్ధం

- రూ.లక్ష మేర ఆస్తి నష్టం

- ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ఏఎం పురం పంచాయతీ రాఘవరాజపురంకి చెందిన అంగన్వాడీ టీచర్ రెడ్డమ్మ ఇంట్లో మంగళవారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు అదుపు చేయడం ప్రయత్నించారు. అంతలోనే ఇంట్లో ఉన్న వస్తువులు బీరువాలో ఉన్న డబ్బులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న వెంటనే మండల తహశీల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో మురళీమోహన్, ఎస్ఐ రాజకుల్లయప్ప ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.లక్ష 30వేలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వ పరంగా రెడ్డమ్మ కుటుంబానికి సాయం అందేలా చూస్తామని అధికారులు తెలిపారు.

30న పారా మెడికల్ కోర్సులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : గత నెలలో పారా మెడికల్ కోర్సులకు అప్లై చేసుకున్న వారికి ఈనెల 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఎస్‌వి వైద్య కళాశాల, సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెలక్షన్ కమిషన్ ప్రచురించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇతర నిబంధన ప్రకారం సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే దరఖాస్తుదారులందరూ ఎంపిక కమిటీ ముందు వారి ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, పదవ తరగతి మార్కుల జాబితా, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, ఇంటర్ బదిలీ సర్టిఫికెట్, ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు స్టడీ, కండక్ట్ సర్టిఫికేట్స్, విద్యార్థి ఆధార్ కార్డు, (తాజా), పాస్‌పోర్టు సైజు రెండు కలర్ ఫొటోలు, పిహెచ్, విహెచ్, సర్టిఫికెట్ వికలాంగుల రిజర్వేషన్ క్లెయిమ్ చేసే అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలని సూచించారు. ట్యూషన్ ఫీజు రూపాయలు రూ.ఆరువేలు (ఒక్క సంవత్సరానికి) రూ.ఐదు వందలు అడ్మిషన్ ఫీజు, రిఫాండబుల్ కాషన్ డిపాజిట్ కింద వెయ్యి రూపాయలు, పారామెడికల్ బోర్డు అడ్మిషన్ ఫీజు రూ.200 మొత్తం రూ.7,700లు చెల్లించాలన్నారు. ఇది ఈ కళాశాల సీటు కేటాయింపు సమయంలో మాత్రమే చెల్లించాలన్నారు.

పరిశ్రమలు 4-పీ నమూనాతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సామాజిక సేవా అభివృద్ధి కార్యాక్రమాల్లో భాగంగా పరిశ్రమలు 4–పీ నమూనాతో ముందుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సూచించారు. స్థానిక ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన వాలిడిక్టోరియస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ లిట్రసీ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసుకుని విజేతలైన మహిళలు, విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు సమీప ప్రాంతాల్లోని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంచే ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. పబ్లిక్, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి నూతన పాలసీ స్పీడ్ డూయింగ్ బిజినెస్ ప్రశంసనీయమన్నారు. పరిశ్రమల పరిసర ప్రాంతాల్లోని పల్లెలు అభివృద్ధి చెందితేనే ఆ పరిశ్రమలు అసలైన అభివృద్ధి సాధించినట్లని తెలిపారు. ప్రభుత్వ ఒడంబడిక ప్రకారం పరిశ్రమలన్నీ సిఎస్ఆర్ నిధులతో కచ్చితంగా అభివృద్ధి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లోని డ్రాప్ అవుట్ విద్యార్థు లను గుర్తించి వారికి వృత్తి శిక్షణ నైపుణ్యతనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించా లని సూచించారు. తద్వారా జీవ నోపాధి అవకాశాలు పెం పొందిస్తూ గ్రామాలు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. విదేశాల్లోనూ ప్రస్తుతం పదో తరగతి పైన చదివిన విద్యార్థుల్లో సామర్థ్యాలను గుర్తించి తగిన విధంగా నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తున్నారనీ, ఆ దిశగా మనం కూడా నడవాల్సిన అవసరాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. గోశాలకు, సోషల్ ఫారెస్ట్ అభివృద్ధి కోసం అవసరమైన బంజరు భూములను పరిశ్రమకు రెవెన్యూ అధికారులు అందజేయాలని ఆర్డిఓ రవి శంకర్ రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండీ సురేష్ ఖండేల్‌వాల్, ప్రతినిధులు దొరై రాజ్, పీఆర్వో అభిషేకం పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలలో సునీల్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - సత్యవేడు: దక్షిణ భారత బాడీ బిల్డింగ్ పోటీలలో తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కొల్లడం గ్రామానికి చెందిన ఎంపిటిసి సెల్వి రమణ కుమారుడు సునీల్ ప్రథమ స్థానంలో నిలిచారు. తమిళనాడు కవర్పేట ఎంజె కళ్యాణ మండపంలో ఆగస్టు 18వ తేదీ నిర్వహించిన దక్షిణ భారత బాడీ బిల్డింగ్ పోటీలలో చెన్నై, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి 40 మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారని నిర్వాహకులు చెప్పారు. భారత్ క్లాస్కె సౌత్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన పోటీలు రాత్రి 10 గంటలకు కొనసాగింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న సునీల్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానంలో విజేతగా నిలిచారు. ఈ క్రమంలో విజేత సునీల్ కు దక్షిణ భారత బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వాహకులు బహుమతిని, సర్టిఫికెట్‌ను అందించారు. బాడీ బిల్డింగ్ పోటీలను సత్యవేడు, వరదయపాలెం మండలాల నుండి 30 మందికి పైగా కవర్‌పేటకు వెళ్లి తిలకించారు. బాడీ బిల్డింగ్ పోటీలలో ప్రథమ స్థానంలో విజేత నిలిచిన సునీల్‌ను ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టిడిపి మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పరమశివం అభినందించి ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఎస్ఐ సహదేవి తెలిపారు. సోమవారం సాయంత్రం 6గంటలకు బైరెడ్డిపల్లి–పుంగనూరు రోడ్డు పెద్ద వెలగటూరు గ్రామం సంపల్లి క్రాస్ వద్ద గంగవరం మండలం దండపల్లి గ్రామానికి చెందిన బి.మురళి, రమేష్ కర్నాటక మద్యం 96 టెట్రా ప్యాకెట్లను ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE CHITTOOR
E.A.NO.1 OF 2024
O.E.P.NO. 87 OF 2009
O.S.No. 205 OF 2006

Between:
K. Neelavathi ....Decree Holder
And:
J. Maheswari (Died) ...Judgment Debtor
Nalini, Do. J.Maheswari 3rd L.R.

NOTICE TO 3RD L.R

To
Nalini, D/o Late J. Maheswari, Residing at D.No.30-595, Panchala puram, Pantrampalli Post, Chittoor Mandal and District.

Madam,
The Decree holder filed the above E.P. for recovery of the amount due under the decree. The said E.P. is posted to 22-09-2024 for your appearance. If you have got any objection, you may appear on 22-09-2024 at 10.30 a.m. either in person or through an advocate before this Hon'ble court, if you failed to do so the matter will be decided exparte.

Place: Chittoor
Date : 20/8/2024

Sd/-(K. Kalyan Kumar)
Advocate for the D.Hr